# డెమొక్రసీ తాంగా



ఎలక్షన్

వర్షం ధారాపాతంగా కురుస్తోంది.

భద్రం మంచంమీద పడుకొన్న ఏడాది పిల్లవాడికేసి చూస్తూ కూర్చుండి పోయాడు.

కురుస్తున్న వర్షంలో, రావిచెట్టుమీద పక్షి కట్టుకున్న గూడులోంచి, ఒక్కొక్క పుల్లా కిందపడుతోంది. గూడుకట్టుకొన్న భద్రం ఆలోచనల పరిస్థితీ అలానేవుంది.

కుండపోతగా వర్షం కురుస్తోంది. ఆకాశాన్నంటుతున్న చెట్లమధ్యగా - కుళ్ళిన ఆకుల్నీ, కొమ్మలకి పట్టిన నాచునీ, కిందకు దిగదోస్తూ మరీ కురుస్తోంది. ఒడ్లని కోసుకొంటూ ప్రవహిస్తున్న బ్రహ్మపుత్రా నదిలో, కూకటి వేళ్ళతో సహా పెల్లగించుకుపోయిన చెట్లు ఒకటొకటిగా పడుతున్నాయి. అడుగుతీసి అడుగు వెయ్యడానికి కష్టంగా ఉంది భద్రానికి. ఉందనుకున్న దారి ఉధృతంగా కురుస్తూన్న వర్షానికి కొట్టుకుపోయింది. వెలుతురుకి మబ్బులూ, వర్షం, చెట్లూ ముసుగువేశాయి. వీపున తడిసి ముద్దయిన కిట్ బరువుగా ఉంది. ఓ భుజాన రైఫిల్ భారంగా ఉంది. మరో భుజంమీద ఆనుకొని గాయపడ్డ సిన్హా అతి కష్టంమీద అడుగడుగూ వేస్తున్నాడు. సిన్హాతోపాటు ఎలాగైనా 'ఫాసిఫూట్ కేంద్రం చేరటానికి ప్రయత్నిస్తున్న భద్రం ప్రయత్నాలకి, ప్రకృతి భయంకరంగా ఆటంకం కలిగిస్తోంది.

వస్తాయనుకొన్న బలాలు వెనుకనుంచి రాకపోవడంతో, ఉన్న కొద్దిమందీ ఉప్పెనలా విరుచుకుపడ్డ చైనా సైన్యంతో కలయబడ్డారు. పిల్‌బాక్స్‌లో కూర్చుని ఉన్న రెండువందల తూటాలనీ మెషీన్‌గన్‌తో కాల్చి పారేసిన భద్రానికి, శత్రు సైనికులు ఎక్కువా, మందుగుండు సామాను సున్నా అవడంతో ఏం చెయ్యడానికీ పాలుపోలేదు. ఉన్న రైఫిల్ని తీసుకుని బయటకు వద్దామనుకొన్న సమయంలో, సరిగ్గా పదడుగుల దూరంలో ప్రేలిన బాంబ్ శబ్దానికి స్పృహతప్పి పడిపోయాడు.

ఒడ్డుకొచ్చిన కెరటం వెనక్కువెడుతూ అంతా తుడిచిపెట్టిన విధంగా, చైనావాళ్ళు సరిహద్దుదాటి వెనక్కు వెళ్ళిపోయారు.

మెలకువ వచ్చిన భద్రం బయటకొచ్చి చుట్టూ చూశాడు. ఆ చెక్‌పోస్ట్‌లో ఉన్న అరవై మందిలోనూ బ్రతికింది, తనతో సహా యిద్దరు! అదైనా సిన్హా ఎక్కువగా గాయపడ్డాడు. మిగిలిందంతా సర్వనాశనమైంది. భద్రం సిన్హా గాయాలకి కట్లు కట్టాడు. ఒక అయిదారు గంటల్లో సిన్హా కాస్తంతగా తేరుకొన్నాడు. పాడైపోయిన వైర్‌లెస్ సెట్‌తో విసిగిపోయిన భద్రం, సిన్హాతోబాటు ఫాసిఫూట్ వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడు. ఉన్న మూడు ట్రక్కులూ, జీపూ ధ్వంసం కావడంతో కాలినడకే శరణ్యమైంది.




భుజంమీద బరువు దిగజారినట్లయి భద్రం పక్కకు చూశాడు. సిన్హా నేల మీద కూలబడిపోయి వున్నాడు. జబ్బ లోంచి, తొడలోంచి రక్తం విపరీతంగా కారుతూ, నేలమీద పడ్తున్న వర్షపు నీళ్ళని ఎర్రగా చేస్తోంది. భద్రం వెంటనే కిందకూర్చుని, సిన్హా తలని ఒడిలో పెట్టుకొని, వర్షం మీద పడకుండా వంగాడు. ఉన్న శక్తినంతా కూడగట్టుకొని సిన్హా అన్నాడు. "ఎందుకొచ్చిన ప్రయాస భద్రం? ఈ రెండు గంటల్లోనూ ఒక్క మైలు నడిచామనుకొంటాను. యింకా నలభై మైళ్ళు పోతేనేగాని గమ్యం చేరుకోలేం. ఏదైనా అదృశ్య శక్తి నీకూ, నాకూ బలాన్నిచ్చి అక్కడకు చేర్చినా, సెప్టిక్ అయిపోయిన ఈ కాలినీ, చేతినీ తీసిపారేస్తారు. అటువంటి జీవితం నాకు వద్దు! నా మట్టుకు నాకు మరో నాలుగైదు గంటలకంటే ప్రాణాలు నిలిచేట్లు లేదు. నేనూ, నన్నంటిపెట్టుకొని నువ్వూ ఇక్కడే ఉండడంవల్ల ప్రయోజనంలేదు ఈ లోపుగా సరిహద్దు కవతల్నించి వాళ్ళు తిరిగి జనప్రవాహంతో వచ్చి ఈ ప్రదేశాన్ని ఆక్రమించే అవకాశం ఎంతైనా ఉంది. వాళ్ళ చేతిలో తిరిగి పడ్డంవల్ల నష్టమేతప్ప, లాభంలేదు. నా మానాన్న నన్ను వదలి, నువ్వేలాగయినా ఫాసిఘాట్ చేరుకో. జరిగింది తెలిసిన తర్వాత అక్కడి వాళ్ళేదైనా కార్యక్రమం ఆలోచిస్తారు."

"పిచ్చివాగుడు వాగక, నిన్ను వదిలి వెళ్ళటం అసంభవం!" భద్రం అన్నాడు.

"భద్రం! స్నేహంకంటే ముఖ్యమైంది కర్తవ్యం. నువ్వు అర్థంలేని

త్యాగం చెయ్యకు, వెళ్ళు." సిన్హా భద్రం చెయ్యిపట్టుకుంటూ అన్నాడు.

భద్రం మౌనంగా లేచాడు. తామిద్దరూ ఎటువంటి పరిస్థితిలో వున్నదీ అతనికి తెలుసు.

"గుడ్, మరో చిన్న ప్రార్థన! ఒకటి, ఈ బాధ భరించలేకుండా ఉన్నాను. రెండు, నువ్వు వెళ్ళిన తర్వాత అడవి మృగాలు నన్ను పీక్కుతినడం తథ్యం. అలాంటి చావు నాకొద్దు!" సిన్హా మాటల్లోని అర్థం తెలుసుకోలేనంతటి మూర్ఖుడు కాదు భద్రం. రైఫిల్ని సిన్హా గుండెల మీద గురిపెట్టి ట్రిగర్ నొక్కాడు భద్రం.

ఓ కాలూ, చెయ్యీ లేకుండా వికలాంగుడిగా పుట్టిన కొడుకుకేసి చూస్తూ కూర్చుండిపోయాడు భద్రం!

ఆకాశాన్ని దూసుకొంటూ, మబ్బు తెరల్ని చీల్చుకొంటూ విద్యుల్లత మెరుస్తూ గర్జించింది.

ఇసుకదిబ్బలోంచి తాడి ఎత్తున ఇసుక లేచింది. టాంక్ యుద్ధంలో దెబ్బతిని, మండుతున్న టాంక్‌లోంచి బయటకు దుమికిన భద్రం, రాజీవ్ వెంటనే నేలవి కరుచుకుపోయారు. పిరమిడ్లలా లేచిన ఇసుక దిబ్బలమీద సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. కాలిన పెనం మీద వేడెక్కిన ఇసుకలో వేగుతున్న శనగకాయల్లా ఉంది వాళ్ళ పరిస్థితి. చెదురు మదురుగా మండుతున్న టాంక్‌లు శ్మశానంలో చితుల్లా ఉన్నాయి.

"రాజీవ్, మనం దూరంగా పరుగెత్తాలి. మన టాంక్ పేలటానికి సిద్ధంగా ఉంది." భద్రం ఆందోళనగా అన్నాడు.

"ఎటని భద్రం?! నడినెత్తిన సూర్యుడు దివ్యజ్యోతిలా ప్రకాశిస్తున్నా ఇప్పుడే అంధకారం నన్నాలింగనం చేసుకొంది!" రాజీవ్ బాధగా అంటూ తల ఎత్తాడు. కళ్ళు రెండూ చితికిపోయి కారుతోన్న రక్తం ఇసుకలో ఇంకిపోతోంది. భద్రం కంగారుగా లేచి రాజీవ్‌ని భుజం మీద వేసుకొని దూరంగా పరుగెత్తడానికి ప్రయత్నించాడు. అడుగడుక్కీ కూరుకుపోతున్న పాదాల్ని అతికష్టంమీద పైకి తీస్తూ అరవై అడుగులు నడిచేసరికి, భద్రంలో ఉన్న శక్తి కాస్తా హరించుకుపోయింది. రాజీవ్‌తోపాటు కూలబడిపోయాడు. అప్పుడు కాని చూడలేదు, రాజీవ్ డొక్కలోంచికూడా రక్తం కారుతోందని.

"భద్రం! మనం వాళ్ళ పన్నెండు టాంకుల్ని ధ్వంసం చేశామనుకొంటాను. మనం దారితప్పి వచ్చినందుకు, వాళ్ళ ఫ్రంట్‌లైన్స్ని వెనక్కి వెళ్ళి సెకండ్ లైన్‌తో భేటీ జరిగినందుకు ఎంత పంట పండిందో చూశావా? మనం ప్రస్తుతం వాళ్ళ భూభాగంలో ఉన్నాం. ఇక్కణ్ణించి బయటకు వెళ్ళడమనేది ఈ గుది బండతో కష్టం! అలాగని ఇక్కడే

కూర్చుంటే, ఈ ఎండకి మాడి చావడం తథ్యం. లేదా వాళ్ళచేతిలోపడి చావడం ఖాయం. ఇంక నేను బ్రతికి ప్రయోజనంలేదు. ఉన్న రెండు నీళ్ళ బాటిల్సినీ తీసుకొని నీ అదృష్టాన్ని పరీక్షించుకో. నా గురించి ఆలోచించకు!" రాజీవ్ వగరుస్తూ అన్నాడు, పళ్ళకింద బాధని అణచిపెట్టుకొంటూ.

"రాజీవ్." బాధగా అరిచాడు భద్రం.

"పరిస్థితి నీకు తెలుసు భద్రం. నా తల పగిలిపోతోంది. కడుపులో పేగులు చుట్టుకుపోతున్నాయి. చర్మం మాడిపోతోంది. ఈ బాధ భరించలేకుండా ఉన్నాను. నాకు త్వరగా విముక్తిని కలిగించు!"

భద్రానికి మతిపోయింది. ఆలోచించడానికి శక్తిలేకపోయింది. నిర్వికారంగా లేచి, రాజీవ్‌కి బాధని దూరం చేసిపారేశాడు.

పుట్టు గుడ్డయిన కొడుకుకేసి చూస్తూ కూర్చుండి పోయాడు భద్రం!

'భగవాన్, ఏమిటీ పరీక్ష!? ఏమిటీ భయంకరమైన ఆలోచన!?' భద్రం కొడుకుమీదనుంచి దృష్టి మళ్ళించి కిటికీ బయటకు చూస్తూ అనుకొన్నాడు. గులాబిచెట్టు మొదట్లో ఉన్న గడ్డిమొక్కని వర్షం ముంచుతోంది. ఆలోచనలు భద్రం మనసుని ముంచుతున్నాయి.

'నువ్వు చేసిన పాపాలకి చిహ్నం నీ కొడుకు.'

'వాళ్ళకి విముక్తి కలిగించాను. నేను పాపం చెయ్యలేదు.'

'ప్రాణం తియ్యడానికి నీకు హక్కు లేదు. జనన మరణాలకి మూల కారణం ఆ భగవంతుడు.'

'అలా అయిన పక్షంలో ఆ భగవంతుని ఆయుధాన్ని నేను. ఆట బొమ్మని. వాళ్ళకి విముక్తి కలిగించడానికి నన్నుపయోగించుకొన్నాడు. ఎదుటి సైనికుల ప్రాణం తియ్యడంలో లేనిపాపం, బాధలో కొట్టుకుపోతున్న వాళ్ళని, భవిష్యత్ అంధకారమైన వాళ్ళని - జీవితాల్ని వాళ్ళు కోరిన మీదట అంతం చెయ్యటంలో ఎక్కణ్ణుంచి వస్తుంది?'

'నువ్వు మొండివాదన చేస్తున్నావ్! కర్మ పరిపక్వం కాకుండా వాళ్ళకి విముక్తి ప్రసాదించావు. అందులో నీ స్వార్థంకూడా లేకపోలేదు. అందుకే నీకీ శిక్ష!'

'శిక్ష నాకు కాదు, ఎదుగుతున్న ఆ పసివాడిది!'

'నీకూ, నీ భార్యకూ కలుగుతోన్న మానసిక క్షోభ, శిక్షకాక మరేమిటి? నువ్విప్పుడు అనుభవిస్తున్న అంపపు కోత, నరకయాతన కాదూ?'

'అలా దారికిరా. అందుకే దాన్ని అంతం చేద్దామనుకొంటున్నాను.'

'అది నీకు శాంతినిస్తుందా?'

'నికృష్టపు జీవితాన్నుంచి నా కొడుక్కి విముక్తిని ప్రసాదిస్తుంది. అంతకంటే నాక్కావల్సిన శాంతి ఏముంది?'

'నీ శాంతికోసం ఆ జీవాన్ని లిసపేయడం ఘోరంకాదూ?'

'కన్నూ, కాలూ, చెయ్యీ లేని కొడుకుని దుర్భరమైన జీవితంలో తోసి, జీవించడానికి అవకాశమివ్వటం అంతకంటే ఘోరం!'

............

గడ్డిమొక్క నీళ్ళలో మునిగిపోయింది. భద్రం మనసుకూడా మునిగిపోయింది.

వాన వెలిసింది. భద్రం మనసు తేలిక పడింది.

పేరంటానికెళ్ళి తిరిగివచ్చిన శకుంతల ఘొల్లుమంది.

వర్షమంటే భద్రానికి భయం. అది అతని మనస్సులో తుఫాను చెలరేగిస్తుంది. అలాగే నాలుగు వర్షఋతువుల్ని చూశాడు.

బయట పెనుగాలి వీస్తోంది. భద్రం కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. శకుంతల చేటలో బియ్యంపోసి, రాళ్ళు ఏరుతోంది.

"శకూ," భద్రం నెమ్మదిగా అన్నాడు.

"ఊఁ, చెప్పండి." శకుంతల మొగుడికేసి చూస్తూ అంది.

"నేను పాపం చేశాను."

"ఏఁవిటి, మీ ధోరణి అలా వుంది?"

"నేను పాపం చేశాను. రాఁవుణ్ణి చంపేసింది నేను!"

శకుంతల స్థాణువులా కూర్చుండిపోయింది. ఆమె మనసులో అప్పుడప్పుడూ, రాముడి చావు సహజంకాదని అనుమానపడ్తూనే వచ్చింది. నెమ్మదిగా తేరుకొని అంది.

"మీరు రాఁవుడ్ని చంపలేదు. వాడికి మీరు నిజమైన జీవితాన్ని ప్రసాదించారు."

"లేదు, వాడికి మృత్యువును ప్రసాదించాను. వాడిని చంపడానికి నా కధికారంలేదు."

"అదే అంటున్నాను. వాడికి విముక్తి కలిగించి నిజమైన జీవితాన్నిచ్చారు. మృత్యువుకూడా జీవితంలో భాగమే!"

"నువ్వు వేదాంతం మాట్లాడుతున్నావ్. వాణ్ణి చంపి పాపంచేశాను."

"మీరు యుద్ధాలలో ఇద్దరు స్నేహితుల ప్రాణాలు తీసుకొన్నప్పుడుకూడా యిలా బాధపడలేదు."

"అని నువ్వనుకొంటున్నావ్. బాధపడ్డాను. అయినా వాళ్ళకోరిక మీదనే అలా చేశానని సమాధానపర్చుకొన్నాను. రాఁవుడు నన్ను తనని చంపమని అడగలేదు. మాటలేరాని పసికందు వాడప్పుడు."

"మీకు పిచ్చెక్కినట్లుంది. హాయిగా ఏ సినిమాకో పోయిరండి."

"శకూ, రాఁవు అంతమవటం నీకిష్టమేనా?" భద్రం చాలా కఠోరమైన ప్రశ్న అడిగాడు. శకుంతల లేచి అంది ఆమెకు మొగుణ్ణి ఆ అవస్థలోంచి బయటకు లాగాలన్న ధ్యాసతప్ప, మరోటిలేదు.

"నేను చెయ్యాలనుకొని, చెయ్యలేని పనిని మీరు చేశారు! డబ్బెట్టి కొన్న బియ్యంలోంచి రాళ్ళు ఏరి అవతల పారేసే నాకు, కన్నందుకు వాణ్ణి లేకుండాచెయ్యడానికి ధైర్యం లేకపోయింది.

భద్రం వింతగా శకుంతలకేసి చూశాడు. శకుంతల భద్రం భుజంమీద తల ఆన్చింది. కన్నీటితో అతనిభుజాలు తడుస్తున్నాయి. భద్రం విసురుగా కుర్చీలోంచి లేచాడు.

"లాభంలేదు, శకూ! నేనీ మానసిక క్షోభననుభవించలేను. అందుకనే నేరం ఒప్పుకొని చట్టానికి లొంగిపోదామనుకొంటున్నాను!"

"మీరిదివరకు చేసిన వాటిని గురించి చెప్పి శిక్షపొందారా?"

"ధైర్యం లేకపోయింది. మీగురించి ఆలోచించవలసి వచ్చింది. ఇంక యీ బాధ భరించలేను. నాకు శిక్షపడాలి!"

"ఇప్పుడు మా గురించి ఎందుకు ఆలోచించటంలేదు? శివుడు ఆరో క్లాసులో ఉన్నాడు. రాధ మూడోక్లాసులో ఉంది. ఈ కుటుంబానికి మీ రెక్కలే ఆధారం. మీరు వెళ్ళి పోలీసుల చేతుల్లో పడతానంటే, ఆ శిక్ష మీకుకాదు. మీ కుటుంబానికి. వాళ్ళు చెయ్యని నేరానికి పిల్లలిద్దరూ ఎందుకు బాధపడాలి? మీకు వచ్చిన ఆలోచన నాకూ వచ్చింది. మీరు ఆచరణలో పెట్టగలిగారు. నేను పెట్టలేకపోయాను. అటువంటి ఆలోచన వచ్చినందుకు నేనూ శిక్షార్హురాలినే. ఈ పిల్లల్ని ఏ విధమైన ఆధారమూ లేకుండా పెంచడమనేది నాకు శిక్షనుకొంటే మీరు మీ ఇష్టంవచ్చినట్లు చెయ్యండి!" శకుంతల ఆవేశంగా అంది.

భద్రం పెళ్ళాం వైపు చూడలేకపోయాడు. తలదించుకొనే అన్నాడు భయంగా. "నేను ఆర్మీలో ఉన్నప్పుడు ప్రాణాలు పోగొట్టుకొని ఉంటే ఏం చేసే దానివి?"

"రేపు మరేదైనా ప్రమాదంలో చచ్చిపోతారు. మాయదారి రోగమేదైనా వచ్చి కన్నుమూస్తారు. దారికాసిన దొంగలచేత వెన్నుపోటు పొడిపించుకుంటారు. అడగండి, ఏం చేస్తావని అడగండి!" శకుంతల పిచ్చిగా అరుస్తూ అంది.

భద్రం మరి మాట్లాడలేదు. బయట వీస్తున్న హోరుగాలి ఉధృతం నెమ్మది నెమ్మదిగా తగ్గింది. భద్రం మనసుకూడా నెమ్మదిగా అదుపులోకి వచ్చింది.

పదిహేడు సంవత్సరాల తర్వాత....

ఓరోజు ఉదయం శకుంతల మనవణ్ణి ఎత్తుకొని గుమ్మంలో నిల్చొని, వచ్చే పోయే కార్లనీ, బళ్ళనీ చూపిస్తూ ఆనందిస్తోంది. భద్రం పెళ్ళాంవైపు తృప్తిగా చూసి, గేటు తలుపు తీసుకొని బయటకు వెళ్తుండగా "తాతా!"అన్నాడు మనవడు.

"టాటా!" భద్రం చెయ్యివూపుతూ రోడ్డుమీదకు దారితీశాడు. రోడ్డుమలుపు తిరిగిన తర్వాత ప్రాయశ్చిత్తంలేని పశ్చాత్తాపంతో సరిపెట్టుకోలేని భద్రం పోలీసుస్టేషనువైపు అడుగులు వేశాడు.

———